క్లుప్తంగా

జగనన్న కాలనీలో పర్యటన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్ : స్థానిక పుట్లూరు రోడ్డు ఆర్టీటీ కాలనీలోని జగనన్న కాలనీలో బుధవారం ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించారు. కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమస్యలు ఆయన తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్, హౌసింగ్, వార్డు సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు ఉన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

పెద్దవడుగూరు : క్రిష్టిపాడు, పెద్దవడుగూరు గ్రామాల్లోని పెట్రోల్ బంకులను డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాములు, ఆర్ఐ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పెట్రోల్ బంకు లైసెన్స్‌లు, పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. వాహన దారులకు కనీస సదుపాయాలను కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. రికార్డులు సక్రమంగా లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ఆరాధన

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో బుధవారం రాత్రి భస్మ బుధవార ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ జీ డేవిడ్‌నాయక్ మాట్లాడుతూ ఈ భస్మ బుధవారం నుంచి గుడ్ ఫ్రైడే వరకూ 39 రోజులు పాటు క్రీస్తు శ్రమల దినాలుగా క్రైస్తవులు పాటిస్తారన్నారు. అందులో భాగంగానే ఈ దినాలను క్రైస్తవులు ఉపవాస దినాలుగా ఆచరిస్తారన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, ప్రసాద్, రజని, మంజుల, మేరి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



ప్రకాష్ (ఫైల్)

గుంతకల్లు: స్థానిక శ్రీశంకరనందగిరిస్వామి డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గురికాల ప్రకాష్ డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ గోపాల్ బుధవారం తెలిపారు. చౌదరి చరణ్‌సింగ్ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ భబితత్యాగి పర్యవేక్షణలో 'కన్స్యూమర్ ఒపీనియన్ ఆన్ ఇంపాక్ట్ ఆఫ్ మొబైల్ కామర్స్' అనే అంశంపై ప్రకాష్ చేసిన పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలియజేశారు.

నేడు కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని షాదీఖానాలో గురువారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా ఆయూష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు బుధవారం తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఓటర్, ఆధార్, రేషన్‌కార్డుల్లో ఏదోకటి లేదా ఏదైనా గుర్తింపుకార్డుల రెండు జిరాక్స్ కాపీలు, సెల్ నంబర్‌తో శిబిరానికి రావాలని సూచించారు.

27న టెంకాయల విక్రయ వేలం

యాడికి: ఈ నెల 27న మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ దుర్గాప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మార్చి 10 వరకు జరిగే లక్ష్మీ చెన్నకేశవస్వామి తిరునాల సందర్భంగా టెంకాయల విక్రయించేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు హుండీ కానుకలు లెక్కిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గుత్తి: పట్టణంలోని కోట ఏరియాలో కొండపై అతిపురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, పూజారులు, అర్చకుల ఆధ్వర్యంలో వందలాది మంది భక్తుల సమక్షంలో వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నరసింహస్వామి మాలధారుల ఇరుముడి కార్యక్రమం జరిగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సమన్వయంతో పని చేస్తేనే మండలాభివృద్ధి



ప్రజా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న ఈఓఆర్డీ దామోదరమ్మ

బుక్కరాయసముద్రం: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా అధికారులు ఆయా శాఖల ప్రగతిని చదివి వినిపించారు. మండల సర్వసభ్య సమావేశానికి తహసీల్దార్ ఒక్క రోజు కూడా రాకపోతే ఎలా అంటూ జెడ్పీటీసీ భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యలు, జగనన్న లే అవుట్లలో సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ వర్కర్లు సరిగా విధులకు హాజరు కావడం లేదని ఎంపీపీ పేర్కొన్నారు. గ్రామాల్లో పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. బైజూస్ ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసిందని ఎంఈఓ గురుప్రసాద్ తెలిపారు. వేసవిలో విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్ కుమార్ తెలిపారు. ఎంపీడీఓ తేజోత్స్న, వైస్ ఎంపీపీ రామగోపాల్, ఈఓఆర్డీ దామోదరమ్మ, హెచ్‌ఓ, ఏపీఓ శ్రీదేవి, పశువైద్యాధికారి పెద్దన్న, డాక్టర్ లక్ష్మి స్వాతి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి పనులు కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

గుత్తి రూరల్: గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏపీఓ మద్దిలేటితో కలిసి మండలంలోని ఉపాధి హామీ ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులకు వస్తున్న కూలీలకు సరైన వసతులు కల్పించాలన్నారు. వేసవికి ముందే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచి పనుల లక్ష్యం త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే చోట వసతులు కల్పించాలన్నారు. కొలతల విషయంలో కచ్చితంగా ఉండాలన్నారు. వచ్చే వేసవిలో కూలీలకు మజ్జిగ, తాగునీరు, నీడ కల్పించేందుకు టెంట్లు ఏర్పాట్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలన్నారు. టీఏలు రత్నాలు, చెన్నారెడ్డి, మైసూరారెడ్డి, లోకేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు రంగయ్య, ఈశ్వర్, గోపాల్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించండి

యల్లనూరు: ప్రతి ఒక్క కూలీకి ఉపాధి పనులను కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవిలో కూలీలు ఉదయం పూట పనులకు వెళ్లి ఎండ తక్కువ ఉన్న సమయానికి ఇంటికి చేరుకోవాలన్నారు. సాంకేతిక సహాయకులు పనులు గుర్తించి కూలీలను పనులకు పంపించాలన్నారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, క్షేత్ర, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ ఆశయ సాధనకు పాటుపడదాం



ఉయ్యాలవాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: భారతదేశ ప్రథమ స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆశయ సాధనకు పాటుపడదామని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అశ్వర్థనారాయణ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రెడ్డి సంఘం కార్యాలయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమంలో నరసింహారెడ్డి చేసిన పోరాటాల గురించి కొనియాడారు. నాయకులు జగదీశ్వరరెడ్డి, కెవి.రంగారెడ్డి, అశ్వర్థనారాయణరెడ్డి, కొండారెడ్డి, నీలకంఠరెడ్డి, రంగస్వామి, నాగభూషణంరెడ్డి, చెన్నారెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

గార్లదిన్నె: ఈనెల 26న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. బుధవారం కెకె తండాలో సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం చలో ఢిల్లీ పోస్టర్లు విడుదల చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పామిడి: మండలంలోని సొరకాయలపేటలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పెద్ద సుబ్బరాయుడు కుమారుడు నాగేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తీవ్ర మనోవేదనకు గురై బుధవారం పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

పైప్‌లైన్ మరమ్మతు త్వరితగతిన పూర్తి చేయండి



పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరురోడ్డు బండమ్మ హోటల్ వద్ద పైప్‌లైన్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి సమీప కాలనీల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. బుధవారం ఆమె ఎంఈఈ విశ్వనాథ్, డీఈ హేమచంద్రతో కలిసి పైప్‌లైన్ రిపేరీ పనులను పరిశీలించారు. వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. నీటి సమస్యలపై వాటర్‌వర్క్స్ సిబ్బంది వెంటనే స్పందించాలని ఆమె తెలియజేశారు.

వైభవంగా రామలింగేశ్వరుడి గ్రామోత్సవం



ఇరుసు ఎత్తుతున్న యువకుడు



స్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న యువకుడు

యాడికి: కోనుప్పలపాడు గ్రామంలో కోన రామలింగేశ్వరుడి గ్రామోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. కోన రామలింగేశ్వరుడి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఇరుసు ఎత్తే పోటీలను ప్రారంభించారు. ఇందులో ఐదు గురు పాల్గొనగా ప్రథమ బహుమతిని ఓబుళాపురం శేఖర్, ద్వితీయ బహుమతిని పెద్దవడుగూరు మండలం చిత్రచేడు గ్రామానికి చెందిన భాస్కర్ సాధించారు. విజేతలకు బాలరంగయ్య రూ.3 వేలు, రూ.2 వేలు నగదు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పామిడి: మండలంలోని పొగరూరు గ్రామ సమీపాన 44 నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు మైదాపిండి లోడ్‌తో ఐచర్ వాహనం బయలుదేరింది. పొగరూరు వంతెన వద్ద వేగంగా వచ్చిన వాహనం అదుపుతప్పి వంతెన రెయిలింగ్‌ను ఢీకొంది. వాహనంలో ఉన్న డ్రైవర్, క్లీనర్ గాయాలతో బయటపడ్డారు. ఐచర్‌ను క్రేన్ సాయంతో తొలగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

పామిడి: పట్టణంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు గాయపడ్డాడు. వివరాలు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన చిన్న వెంకటేశ్వర్లు కుమారుడు నందు అనంతపురం నుంచి స్కూటర్‌పై ఆదోనికి బయలుదేరాడు. పట్టణంలోని జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేద కళాకారులకు అండగా నిలుస్తాం



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు సుధాకర్

గుంతకల్లుటౌన్: పేద కళాకారులకు అండగా నిలుస్తామని రైల్వే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎల్‌సీహెచ్.సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ పెన్షనర్స్ కార్యాలయంలో కళాకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌సీహెచ్.సుధాకర్ మాట్లాడుతూ కళారంగాన్ని బ్రతికిస్తున్న రాయలసీమలోని సుమారు 600 మంది కళాకారులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఉడతాభక్తిగా ఆర్థికసాయం చేయాలని తాను సంకల్పించామన్నారు. రాయలసీమలోని 8 జిల్లాలకు చెందిన రంగస్థల నటులు, హార్మోనిస్టులు, తబలిస్టులు, నర్తకీమణులు, డ్రామా కంపెనీవారు, క్లార్నెట్ వాయిద్యకారులు ఆర్థికసాయం కోసం తమ చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రంగస్థల పేద కళాకారుల కళాసమితుల పేర్లు, వారి ఫొటోలు, ఫోన్ నంబర్‌లతో కూడిన వివరాలను మార్చి 10వ తేదీలోగా 7569076977, 9550157287 వాట్సాప్ నంబర్లకు మెసేజ్ పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మే 26న ఆర్థికసాయాన్ని అందజేయనున్నట్లు సుధాకర్ ప్రకటించారు. సుధాకర్ నిర్ణయం అభినందనీయమని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ తహసీల్దార్ జీఎంవీ.చలపతి పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న బొంబాయి రమేష్‌నాయుడు

యాడికి: మండల కేంద్రంలో ఈ నెల 28న నుంచి జరిగే చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల ఆయకట్టుదారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బొంబాయి రమేష్ నాయుడు మాట్లాడుతూ ఆనవాయితీ ప్రకారం ఆయకట్టుదారులు నడుచుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి కోరారు. ఆలయ ఈఓ దుర్గా ప్రసాద్, ప్రధాన అర్చకుడు హరికృష్ణ శర్మ, ఆలయ ధర్మకర్త బొంబాయి రామిరెడ్డి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోట చౌదరి, రాము పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో బుధవారం హుండీ కానుకలు లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రామతులసి పర్యవేక్షణలో ఈఓ విజయ్‌కుమార్ సమక్షంలో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రూ.2,24,078 ఆదాయం వచ్చిందని, గతేడాది కంటే రూ.25,540 అధిక ఆదాయం లభించిందని ఆలయ ట్రస్ట్‌బోర్డు ప్రెసిడెంట్ మురళీధర్ గుప్తా తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు కే నారాయణమూర్తి, వెంకటరాముడు, ఈశ్వర్ రెడ్డి, అర్చకులు రామేశ్వరశర్మ, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

5న జిల్లా స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు

తాడిపత్రి టౌన్: స్థానిక జింకావారి వీధిలోని వైఎస్సార్ మినీ ఆడిటోరియంలో మార్చి 5న జిల్లా స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు తైక్వాండో కోచ్ బాబా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన వారిని మార్చి 10, 11, 12 తేదీల్లో విశాఖపట్నంలోని యలమంచిలి వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఐ సీనియర్ నేత పెద్దన్న మృతి



పెద్దన్న (ఫైల్)

గుత్తి: పట్టణంలోని దాసరి కాలనీకి చెందిన సీనియర్ సీపీఐ నేత పెద్దన్న(75) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పెద్దన్న గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో ఉదయం తుది శ్వాస విడిచాడు. పెద్దన్న మృతి పట్ల సీపీఐ మండల, పట్టణ కన్వీనర్లు రామదాసు, మాబు, సీనియర్ నాయకులు రమేష్, నరసింహులు, షఫి, అశోక్, మధు తదితరులు సంతాపం ప్రకటించారు.

మాతృభాష అమ్మ వంటిది



మాట్లాడుతున్న కేసీ హరి

గుంతకల్లు రూరల్: పుట్టిన క్షణం నుండి మనకు అన్నింటినీ తెలియజేసే మాతృభాష అమ్మ వంటిదని, కావున మాతృభాషను ఎన్నటికీ మరువవద్దని ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ త్రిశాల బన్సాలీ పేర్కొన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మనోహర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాతృభాషా గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు మాతృభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు.

గుంతకల్లు: మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కేసీహరి మాట్లాడుతూ మాతృభాష తెలుగులో అభ్యసించిన వారు ఏ ఇతర భాషల్లోనైనా రాణించగలరన్నారు. ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు బసెట్టి కృష్ణయ్య, శ్రీనివాసులు, పి.గోపి పాల్గొన్నారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: ఉద్యోగం కంటే పది మందికి ఉపాధి కల్పించే వారిగా ఎదగాలని ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్, ఉన్నత విద్యామండలి సంయుక్తంగా మంగళవారం నూతన ఔత్సాహిక పారిశ్రామిక విధానం అనే అంశంపై ఎస్కేయూలో సదస్సు నిర్వహించారు. వినూత్న ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. అటల్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కే.నాగభూషణ రాజు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ..డ్రైవర్‌కు తీవ్రగాయాలు



స్టీరింగ్ మధ్యలో ఇరుక్కున్న డ్రైవర్

యాడికి: ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన రాయలచెరువులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి వివరాల మేరకు.. బుధవారం రాత్రి 0127 నంబరు గల లారీ గుత్తి నుంచి తాడిపత్రి వైపునకు బయలుదేరింది. 0244 నంబరు గల లారీ యాడికి నుండి రాయలచెరువులోకి వస్తుండగా యాడికి మలుపు వద్ద రెండు లారీలు ఢీ కొన్నాయి. తాడిపత్రి వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ కరుణాకర్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. ఎస్‌ఐ ఘటన స్థలికి చేరుకుని స్థానికులతో కలిసి జేసీబీ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీసి 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: కల్లూరులో 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పామిడి 108 సిబ్బంది వివరాల మేరకు పెద్దవడుగూరు మండలం కొండూరుకు చెందిన సిలార్‌బాషా బైక్‌పై కల్లూరు నుంచి పామిడి వైపు బయలుదేరాడు. ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో సేఫ్ ఆస్పత్రి వద్ద మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో వైటీ చెరువు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పుల్లన్న(34) మృతి చెందిన విషయం విదితమే. మృతుని భార్య దేవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పామిడి: పదో తరగతి తర్వాత డ్రాపౌట్ అయిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్ చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల సుభద్ర సూచించారు. ఈనెల27లోపు విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితాలో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

27న ఆర్డీటీ క్రికెట్ టోర్నీ

తాడిపత్రి టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు కోచ్ భార్గవ్ తెలిపారు. ఆర్డీటీ తాడిపత్రి ఏటీఎల్ రామాంజనేయులు, సీనియర్ క్రికెట్ కోచ్ సాధక్ ఆధ్వర్యంలో జరగనున్న టోర్నీలో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9347640651, 9490677916 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పండ్ల తోటల పరిశీలన

పెద్దపప్పూరు: మండలంలోని అమ్మలదిన్నె, జూటూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన దానిమ్మ, పూలు, కూరగాయల తోటలను బుధవారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రఘునాథ్ రెడ్డి, సహాయ సంచాలకుడు నరసింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా దానిమ్మ తోటలో మచ్చ తెగులు నివారణకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ ఉద్యాన అధికారిణి ఉమాదేవి, గ్రామ ఉద్యాన సహాయకులు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలపై నేడు అవగాహన సదస్సు

అనంతపురం సిటీ: బీఎస్ఎన్ఎల్ సేవలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన బుధవారం విడుదల చేశారు. అనంతపురంలోని వేమన టెలిఫోన్ భవన్‌లో ఉదయం 11 గంటలకు తమ సంస్థ అందించే వివిధ రకాల సేవలపై ఏర్పాటు చేయనున్న అవగాహన సదసుకు ఆసక్తి గల వార ందరూ రావాల్సిందిగా కోరారు.

సమయపాలన పాటించాలి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

యాడికి: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక నం:5 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

పామిడి: కండ్లపల్లి గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన సచివాలయ రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.